క్లుప్తంగా

నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి

మహబూబాబాద్ రూరల్: సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న షెడ్యూల్డ్ తెగల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, ఉన్నత విద్యను అభ్యసించడానికి వాయిస్ ఫర్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఆర్.వివేక్ రాం అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రెడ్యాల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా శిబిరాన్ని ప్రారంభించారు.

చెక్కుల పంపిణీ



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో శనివారం రూ.2,59,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగయ్య, కిశోర్, శ్రీనివాస్, సూరయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి సునీల్ కుమార్‌కు ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్ పట్టా వరించింది. 'రిలేషన్షిప్ బిట్వీన్ బాడీ టైప్స్ అండ్ ఫిజికల్ ఫిట్నెస్ వేరియబుల్స్ అమాంగ్ ఇంజనీరింగ్ కాలేజ్ స్టూడెంట్స్ ఇన్వెస్ట్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ఉస్మానియా యూనివర్సిటీలో డాక్టరేట్ పట్టా అందుకున్నాడు.

ఎన్నికల హామీలు విస్మరించిన ప్రభుత్వం



గార్ల: ఎన్నికల హామీలను విస్మరించిన అధికార పార్టీకి రానున్న పంచాయతీ ఎన్నికల్లో పతనం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ మండల కార్యదర్శి అలువాల సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హరినాయక్, రాజారావు, అంబటి వీరస్వామి, వి పెద్దవెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సులో గురునాథరావు



కేసముద్రం: తమిళనాడులోని చైన్నైలో జనవరి నెల 29 నుంచి 31వరకు జరిగిన అంతర్జాతీయ సదస్సులో మండలంలోని పెనుగొండ జెడ్పీహైస్కూల్‌కి చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వి.గురునాథరావు పాల్గొన్నారు. డిజిటల్ పరివర్తన యుగంలో ఉపాధ్యాయ విద్యలో మార్పును సాధించడానికి, సమర్థమైన నిర్వహన వ్యూహాలు అనే అంశంపై నిర్వహించిన ఇట్టి సదస్సులో, డిజిటల్ తరగతుల కోసం ఉపాధ్యాయ సిద్ధతను పెంచడం, అధ్యయనం అనే పరిశోధన పత్రాన్ని ఆన్‌లైన్‌లో ప్రవేశపెట్టినట్లు ఉపాధ్యాయుడు గురునాథరావు తెలిపారు.

కులవ్యవస్థను నిర్మూలించాలి

బయ్యారం: రోజురోజుకు దేశంలో పెరిగిపోతున్న కులవ్యవస్థ అనేక అనర్థాలకు దారితీస్తుందని కులవ్యవస్థ నిర్మూలనలో యువకులు భాగస్వాములు కావాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు మధు అన్నారు. మండలంలోని గంధంపల్లిలోని వెనిగళ్ల జగ్గయ్య ప్రజాకల్యాణ వేదికలో శనివారం పార్టీ ఆధ్వర్యంలో కృష్ణచైతన్య–నవీన్‌ల కులాంతర ఆదర్శ వివాహంను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు అశోక్, ఐలయ్య, సక్రు, చిన్నచంద్రన్న పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ముందుండాలి

నెహ్రూసెంటర్: కమ్మ కులస్తులు అన్నిరంగాల్లో ముందుండాలని కమ్మ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్ఆర్‌కె ప్రసాద్ అన్నారు. కమ్మ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్మ కులస్తులు ధాతృత్వానికి మారుపేరు అని, తమ కులస్తులతోపాటు అన్ని కులాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కమ్మలందరూ ఐక్యంగా ఉంటూ అన్నిరంగాల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్టర్ అడప రవీందర్, కండపనేని రత్నాకర్‌రావు, డాక్టర్ కల్వకూరి చంద్రశేఖర్, శ్రీదేవి, రావూరి మాధవ్, నున్న రమణ, రావూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఒంటికొస్తే రోడ్డెక్కాల్సిందే..

- మరుగుదొడ్ల కొరతతో విద్యార్థుల ఇబ్బందులు
- సమస్యల వలయంలో హరిశ్చంద్రుతండా పాఠశాల



మూత్ర విసర్జన కోసం క్యూ కట్టిన విద్యార్థులు



ఆరుబయట మధ్యాహ్న భోజన వంట

డోర్నకల్: డోర్నకల్ మండలం రాముతండా గ్రామ పంచాయతీ పాఠశాలలో పలు సమస్యలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హరిశ్చంద్రుతండా పాఠశాలలో 1నుంచి 5తరగతుల్లో 101 మంది విద్యార్థులు ఉండగా ఏడుగురు ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. విద్యార్థులకు సరిపడా వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాముతండా, హరిశ్చంద్రుతండా, లకావత్‌తండాల పరిధిలో ఒకే పాఠశాల ఉండటంతో విద్యార్థుల సంఖ్య వంద దాటింది. మండలంలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉన్న పాఠశాలల్లో హరిశ్చంద్రుతండా పాఠశాల రెండోది కావడం విశేషం. ప్రస్తుతం నాలుగు తరగతి గదులు ఉండడంతో తరగతులు జరిగే సమయాల్లో ఇద్దరు ఉపాధ్యాయులు బయట వేచి ఉంటున్నారు. మధ్యాహ్న భోజనం వంటను ఎండలోనే చేస్తున్నారు. విద్యార్థుల అవసరాలకు సరిపడా నీరందడం లేదు. పాఠశాలలో ఒక పాత మరుగుదొడ్డి ఉండగా దానిని ఉపాధ్యాయులు వినియోగిస్తున్నారు.

క్యూ కడుతున్నారు..

పాఠశాలలో మరుగుదొడ్ల కొరతతో ఉదయం, సాయంత్రం పాఠశాల విరామ సమయాల్లో విద్యార్థులు మూత్ర విసర్జన కోసం రోడ్డు పక్కన క్యూ కడుతున్నారు. బాలికల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. బాలికల సంఖ్య ఎక్కువగా ఉండటం, టాయిలెట్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని మహిళా ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాఠశాలలో నెలకొన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రజల కష్టాలను తీర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్



అండర్ పాస్ సందర్శిస్తున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీ వద్దగల అండర్ పాస్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కి సమీపంలో ఉన్న అండర్ పాస్ బ్రిడ్జిని మూడో లైన్ రైల్వే ట్రాక్ నిర్మాణం కోసం దీనిని పూర్తిగా మూసివేయగా స్థానికుల ఇబ్బందులు రెట్టింపయ్యాయన్నారు. ఫలితంగా ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు తీర్చడమే లక్ష్యంగా ప్రత్యామ్నాయంగా సిగ్నల్ కాలనీ వద్దగల రైల్వే అండర్ పాస్ ద్వారా కార్లు, బైకుల రాకపోకలు కొనసాగే విధంగా తాత్కాలికంగా మార్గాన్ని ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్ సారధిరెడ్డి, ఖలీల్, బండి వెంకన్న, చింతకుంట్ల వెంకన్న, భూక్యా శ్రీను, బట్టు దేవ్ సింగ్, పద్మం ప్రవీణ్ కుమార్, పీరయ్య పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకుంటాం..

తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ అన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుడు శంతన్ రామరాజు శనివారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ ఎల్లయ్య

కురవి: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను అలవర్చుకోవాలని, తద్వారా వ్యాధులను అరికట్టవచ్చని డీపీఎంఓ(డిప్యూటీ పారామెడికల్ అధికారి) డాక్టర్ ఎల్లయ్య అన్నారు. శనివారం బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బలపాల ఉన్నత పాఠశాలలో కుష్ఠువ్యాధి నివారణ అవగహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రతను అలవరుచుకోవాలన్నారు. స్పర్శలేని మచ్చలు వచ్చినప్పుడు తప్పనిసరిగా దగ్గరలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సతీసుకోవాలన్నారు. ప్రతి సోమవారం బలపాల పీహెచ్‌సీలో చర్మవ్యాధుల నివారణకు ఉచితంగా మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

కేసముద్రం: హమాలీ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగిన సీఐటీయూ అనుబంధ ఆల్‌హమాలీ వర్కర్స్ యూనియన్ సదస్సులో వారు మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 13నెలలు కావస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాములు, జంపయ్య, శ్రీను, సూరయ్య, బుచ్చయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి



మరిపెడ: మాట్లాడుతున్న అధికారులు

మరిపెడ/మరిపెడ రూరల్: వచ్చే వేసవిలో మండలంలోని అన్ని గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ, మరిపెడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కనకదుర్గ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని గ్రామ పంచాయతీ బావులు, చేతి పంపులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. నీటి ఎద్దని ఉన్న గ్రామాల్లో వాటిని వినియోగంలోకి తెచ్చేలా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల్లో కొత్త ఓటర్లను గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ సోంలాల్, మిషన్ భగీరథ ఏఈలు అవినాష్‌రెడ్డి, హత్తిరాం పాల్గొన్నారు.

దంతాలపల్లి: రాబోయే వేసవి కాలంలో గ్రామాలలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీఓ అప్సర్ పాషా అన్నారు. గ్రామాలలో ప్రజల తాగునీరు అవసరాలకు ఉపయోగించే నీళ్లలో ఎలాంటి సమస్యలు రాకుండా తీసుకోబోయే చర్యల్లో భాగంగా మండలంలోని బొడ్లాడ, మండలకేంద్రంలో నీటి వసతులను పరిశీలించారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

కేసముద్రం: సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు పక్కనున్న వ్యవసాయబావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంటికన్నె గ్రామ మీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెలగోల దూడయ్య(49) వ్యక్తి తన సైకిల్‌పై గ్రామానికి సమీపంలో గల చంద్రుతండాజీపీకి వెళ్లాడు. తిరిగి రాత్రి సమయంలో ఇంటికి వస్తుండగా, సైకిల్ అదుపుతప్పడంతో తండా సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వ్యవసాయబావిలో జారి పడ్డాడు. గమనించిన వారు కేకలు వేయడంతో అక్కడికి చేరుకున్న స్థానికులు అతన్ని బయటకు తీశారు. అప్పటికే దూడయ్య మృతి చెందినట్లు గుర్తించారు. కాగా మృతుడికి భార్య సమ్మక్క, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న అన్నం ఫౌండేషన్

మహబూబాబాద్ రూరల్: ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అన్నం శ్రీనివాసరావు ఆర్థిక స్థోమతలేని ఒకరికి అంత్యక్రియలు నిర్వహించి శనివారం మానవత్వం చాటుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా నర్సీపట్నంలోని చాకలి కాలనీకి చెందిన పనస పతంజలి పవన్ ప్రేమ్ కుమార్ జిల్లా కేంద్రంలోని శివప్రియ లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. కాగా పోలీసు కేసు నమోదు పోస్టుమార్టం అనంతరం అతడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించగా వారికి ఆర్థికస్థోమత లేకపోవటంతో పోలీసులు అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. దీంతోప్రేమ్ కుమార్ మృతదేహాన్ని ఖమ్మం తీకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

గడ్డివాము దగ్ధం

కురవి: మండలంలోని మోద్గులగూడెం శివారు జుజ్జూరుతండా గ్రామంలో దరావత్ హరిచంద్రు అనే రైతుకు చెందిన గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పంటుకుని శనివారం దగ్ధమైంది. అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు.రూ.60వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

విద్యారంగానికి అరకొర నిధులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మహబూబాబాద్ అర్బన్/కురవి: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భాపాపాక పవన్, గుండ్ల రాకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట శనివారం ఎస్ఎఫ్ఐ విద్యార్థులు నిరసన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈసారి బడ్జెట్‌లో కేంద్రం విద్యారంగానికి కేవలం 6శాతం నిధులు కేటాయించి, విద్యారంగానికి ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు చందు, నాయకులు పవన్, మహేష్, వినోద్, వినేయ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులపై కాంగ్రెస్ చిన్నచూపు



మాట్లాడుతున్న రాంబాబునాయక్

మహబూబాబాద్ అర్బన్: దేశంలో గిరిజన మహిళలపై కాంగ్రెస్ చిన్న చూపుచూస్తుందని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట కార్యదర్శి గుగులోత్ రాంబాబునాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఒక గిరిజన మహిళ అని, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలు నిజంగా సిగ్గు చేటన్నారు. తీన్మార్ మల్లన్న కూడా రాజస్తాన్ బంజారా యువతి మోనాలిసాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గిరిజనలకు క్షమాపణలు చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు రమేశ్, జహేందర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నూతన కార్యవర్గం ఎన్నిక

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సభ ముగింపులో శనివారం నూతన కార్యవర్గాన్ని 11మందితో ఎన్నికున్నట్లు సంఘం రాష్ట ప్రధాన కార్యదర్శి ఏ.సాంబ తెలిపారు. కార్యవర్గం అధ్యక్షుడిగా నవీన్, ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్, ఉపాధ్యక్షుడు ప్రకాష్, సహాయ కార్యదర్శి వినోద్, కోశాధికారి నూతన్, సభ్యులు హనుమంతు, సార్, రాంబాబు, సౌజన్య, సందీప్ ఎనుకున్నామన్నారు.

యువతి అదృశ్యం

పెద్దవంగర: బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన పసునూరి సోమిరెడ్డి విజయ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కాగా కిరాణం షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. కూతురు శృతి(19) ఇంటర్ తప్పిపోవడంతో ఇట్టివద్దనే ఉంటుంది. గత నెల 31న ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తానని చెప్పి సూమారు రాత్రి 7:30గంటలకు బయటకు వెళ్లింది. రాత్రి అవుతున్న తిరిగి రాకపోవడంతో బంధువులు, ఇరుగుపొరుగు వారి వద్ద వెతికిన జాడ తెలియలేదు. శనివారం తండ్రి సోమిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'చలో హైదరాబాద్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నెహ్రూసెంటర్: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్/పెద్దవంగర/నెల్లికుదురు/దంతాలపల్లి: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఈనెల 7వ తేదీన జరిగే చలో హైదరాబాద్‌కు మాదిగ, మాదిగ ఉపకులాలు, మేథావులు, కళాకారులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆకాంక్షను ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ గుగ్గిళ్ల పీరయ్యమాదిగ, పాటమ్మ రాంబాబు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మంద కొమురమ్మనగర్‌లో చలో హైదరాబాద్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలెపాక ఎల్లయ్య, చాగంటి రమేష్, ఎండి.రజియా, కత్తుల రేణుక, పోలెపాక ప్రవీణ్, ఇరుగు రవి, మిడతపల్లి యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జన సభకు తరలిరావాలి



కొత్తగూడ: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడ: రాజకీయంగా ఎదగాలంటే బీసీ కులాలన్ని ఏకం కావాలని బీసీ సంఘాల జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆదివారం జరిగే బీసీ గర్జన మహాసభకు భారీగా తరలిరావాలని కోరారు. అనంతరం మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు.

దంతాలపల్లి: నేడు వరంగల్ పట్టణంలో నిర్వహిస్తున్న బీసీ గర్జన సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో ముదిరాజ్‌లు తరలిరావాలని ముదిరాజ్ మహాసభ రాష్ట కార్యదర్శి నీలం దుర్గేష్ ముదిరాజ్ కోరారు. మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో శనివారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహాసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్, నాయకులు ఆజాద్ చంద్రశేఖర్, యాకయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎమ్మెల్సీ దంపతుల పూజలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ముడుపుగల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయమూర్తి ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సంధ్యారాణి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

పశుగణన సకాలంలో పూర్తి చేయాలి

డోర్నకల్: మండలంలో పశుగణన సకాలంలో పూర్తి చేయాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు ఎన్యుమరేటర్లను ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను శనివారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ పశు వైద్యశాల పరిధిలోని ఏడు రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 6435 సర్వే పూర్తయిందని తెలిపారు. ఫిబ్రవరి 25లోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు.

లోఓల్టేజీ సమస్య లేకుండా చూస్తాం..

బయ్యారం: రానున్న వేసవికాలంలో మండలకేంద్రంలో లోఓల్టేజీ సమస్య లేకుండా విద్యుత్‌శాఖ పరంగా చూస్తామని శాఖ డీఈ(టెక్నికల్) పెద్దిరాజ్యం అన్నారు. మండల కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

డోర్నకల్: మండలంలోని లింబ్యాతండాలో శనివారం పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. తండాలో గుగులోత్ నూతన్, పాల్తియా నాగులపై కుక్క దాడి చేయగా చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తండాలో కుక్కల బెడద తీవ్రంగా ఉండటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కురవి మండలంలోనే కొనసాగించాలి

కురవి: నూతనంగా ఏర్పడిన సీరోలు మండలంలో కలిపిన చింతపల్లి, కొత్తూరు(సీ)గ్రామాలను తిరిగి యథావిధిగా కురవి మండలంలోనే కొనసాగించాలని సీరోలు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మలిశెట్టి వేణు ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గౌసు

కురవి: సీరోలు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కురవి ఎంపీఓగా పనిచేస్తున్న ఎండి గౌసు శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ఇసుక రవాణాను అరికట్టేందుకు కందకాలు

నెల్లికుదురు: అక్రమ ఇసుక రవాణను అరికట్టేందుకు మండలంలోని వివిధ గ్రామాల ఆకేరు వాగు చుట్టు కందకాలు తీయించినట్లు తహసీల్దార్ కోడిచింత రాజు తెలిపారు. శనివారం మండలంలోని మునిగలవీడు, బ్రాహ్మణకొత్తపల్లి, నర్సింహులపేట మండలం కొమ్ములవంచ శివారు నాలుగు ప్రాంతాలల్లో అక్రమ ఇసుక రవాణా జరుగకుండా జేసీబీ సహాయంతో కందకాలు తవ్వించినట్లు తహసీల్దార్ తెలిపారు.

జయప్రదం చేయండి

గార్ల: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఈనెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమానికి జయప్రదం చేయాలని ముద్దివంచ గ్రామంలో పార్టీ మండల కార్యదర్శి జడ సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ వాల్ వాల్‌పోస్టర్లకు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాబూరావు, భద్రయ్య, మల్లేశం, రామారావు, శ్రీను పాల్గొన్నారు.

పేదలను విస్మరించిన కేంద్ర బడ్జెట్

నెహ్రూసెంటర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పూర్తిగా పేద, సామాన్య ప్రజలను విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి అన్నారు. దేశ ప్రజానికానికి కీలకరంగానికి అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర వేతన చట్టం చేయలేని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, దేశ ప్రధాని రైతులకు ఇచ్చిన హామీల అమలు ప్రస్తావన లేకపోవడం సరికాదన్నారు.

ఎంపీటీసీ స్థానాలను పెంచాలని వినతి

కేసముద్రం: ఇనుగుర్తి మండలంలో 6ఎంపీటీసీ స్థానాలు ఉండగా, మరో 2స్థానాలు పెంచాలంటూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ హరిప్రసాద్‌కు, పలు పార్టీల నాయకులు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు.

గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

మహబూబాబాద్ రూరల్: పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రణబ్ కుమార్ ఘోష్ (52) సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్లే హౌరా రైలులో కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తూ రైలు వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ రైల్వేస్టేషన్ దాటిన కొంత సమయం తర్వాత ఆయనకు గుండెపోటు వచ్చింది. రైల్వే ఉద్యోగులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని ప్రయాణికుడిని పరిశీలించి, మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పేద విద్యార్థులను ఆదుకోవాలి

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం, తొర్రూరు ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు గోపా సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకొని పరీక్ష ప్యాడ్స్ శనివారం పంపిణీ చేశారు. హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, జనార్దన్ అన్నారు.రమేశ్ గౌడ్, యాకయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సాగు భూములను పేదలకు పంచాలి

కేసముద్రం: కేసముద్రం రెవెన్యూ గ్రామ పరిధిలో సాగు చేసుకున్న ప్రభుత్వ భూమిని రైతులకు పంచాలని ఎంసీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మర్రిపెల్లి మొగిలి డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ దామోదర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఇసుక డంప్ వేలంపాట

గార్ల: గార్ల పాకాల ఏటి సమీపంలో రెవెన్యూ అధికారులకు ఇటీవల పట్టుబడ్డ అక్రమ ఇసుకడంపును తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేలంపాటలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ రూ.89,250కు పాటపాడి దక్కించుకున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్‌వైర్ చోరీ

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామ శివారులోని 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్‌వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి అపహరించారు. శనివారం చోరీ విషయాన్ని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా, విద్యుత్ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

4న స్టాండింగ్ కమిటీ సమావేశం

నెహ్రూసెంటర్: జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 4వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీ, కొప్పు ప్రసాద్ శనివారం తెలిపారు. జిల్లాలోని గెజిటెడ్ అధికారులు, మండల అధికారులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మోడల్‌స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



మహబూబాబాద్ అర్బన్: మానుకోటలోని మోడల్‌స్కూల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కిసాన్ పరివార్ సీఈఓ వివేక్ అన్నారు. మానుకోట మున్సి పల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రన్నింగ్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన బాలికలకు ఐదు నెలల పాటు డైట్ చార్జీలను రూ.17వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట అధ్యక్షుడు గుగులోతు భీమనాయక్, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని దైవకృప అనాథ ఆశ్రమాన్ని సందర్శించి విద్యార్థులకు 50 క్వింటాల బియ్యం అందజేసి అనాథలతో భోజనం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

కురవి: వీరభద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ డాక్టర్ వివేక్ అన్నారు. శనివారం వీరభద్రస్వామి స న్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఆరోపణలు మానుకోవాలి'

మరిపెడ: మండలంలోని ఎల్లంపేట ఫీల్డ్‌అసిస్టెంట్ ఐనాల మైసయ్యపై అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్ దళిత వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో కావాలని బదనం చేస్తున్నారన్నారు. నాయకులు కృష, బాబు, రాజేష్ పాల్గొన్నారు.

సింహద్వార ప్రతిష్ఠ వేడుకలు

మరిపెడ: మున్సిపాలిటీ కేంద్రంలోని కునాయికుంట సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ముదిరాజ్‌లు ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి దేవాలయం సింహద్వార ప్రతిష్ఠ అత్యంత వేడుకగా జరిగింది.